హెచ్‌సీయూ భూముల అమ్మకం వెనుక భారీ స్కాం

మొదటిపేజీ తరువాయి...

భూముల్లో జింకలు, వన్యప్రాణులు లేవని, విద్యార్థులు ఏఐతో కృత్రిమంగా సృష్టించారని చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు అనుముల ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగిస్తూ వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 'సర్కారు చెప్తున్నదే నిజమైతే, అక్కడి జూపార్క్ అధికారులు హెచ్‌సీయూ ప్రాంతంలోని జూపార్క్‌కు రెండేండ్ల క్రితం తరలించామని ప్రభుత్వానికి ఏవిధంగా నివేదించారు? వారు చెప్పింది అబద్ధమా? విద్యార్థులు చూపుతున్నవి అవాస్తవాలా?' అని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా పర్యావరణవేత్తల, విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని భూముల అమ్మకం ఆలోచనను విరమించుకుంటే మంచిదని హితవు పలికారు. నిజంగా పరిశ్రమల ఏర్పాటుపై నిబద్ధత ఉంటే ఫార్మాసిటీలోని 14 వేల ఎకరాల్లో అనుమతించాలని డిమాండ్ చేశారు.

మూగజీవులను వధిస్తే కేసులేవీ?

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు సర్కారుకు చెందినవే అయితే, రాత్రికి రాత్రి వందలాది బుల్డోజర్లను పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందని కేటీఆర్ నిలదీశారు. విద్యార్థులతో, పర్యావరణవేత్తలతో చర్చలు జరపకుండా, కోర్టును ప్రత్యేక గడువు కోరి తొందరపాటుతో ఎందుకు ముందుకెళ్లారని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూపోరాటంలో ఏఐతో ఫేక్ వీడియోలు సృష్టించారని చెప్తున్న కాంగ్రెస్ నాయకులకు.. సర్కారు విధ్వంసానికి చెదిరి ఇండ్లలోకి వచ్చిన జింకలు కనిపించకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. ఏఐతో ఫేక్ వీడియోల పేరిట అమాయక విద్యార్థులపై కేసులు పెడుతున్న ప్రభుత్వం.. మూగజీవుల వధకు కారణమైన వారిని ఎందుకు వదిలిపెడుతున్నదని ప్రశ్నించారు. ఈ విషయంలో జాతీయస్థాయిలో చాలామంది ప్రముఖులతోపాటు ధ్రువ్‌రాఠీ వంటి వారు కూడా ప్రభుత్వ దుశ్చర్యలను తప్పుబట్టారని గుర్తుచేశారు. ప్రశ్నించిన సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతున్నారంటూ పార్లమెంట్‌లో కేసీ వేణు

> *కృష్ణా జలాల వాడకంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బీఆర్ఎస్ హయాంలో 36% జలాలను వినియోగించుకున్నం.. కానీ, ఈ సీజన్‌లో విరివిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నిండుకుండల్లా మారినా తెలంగాణ మాత్రం 24% జలాలనే వినియోగించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. -కేటీఆర్*

గోపాల్ చేసిన వ్యాఖ్యలను తాను సమర్థిస్తున్నట్టు, ఆయనతో ఏకీభవిస్తున్నట్టు కేటీఆర్ స్పష్టంచేశారు. హెచ్ఎండీఏ అనుమతి లేకుండా వందలాది చెట్లను నేలమట్టం చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని చెప్పారు.

చోద్యం చూస్తున్న కేంద్రం

హెచ్‌సీయూలో ఇంత రగడ జరుగుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏమీ ఎరగనట్టు చోద్యం చూస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. ఇక్కడి పరిస్థితులను చూసి సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి ప్రభుత్వ దుర్మార్గంపై మొట్టికాయలు వేసిందని, చీఫ్ సెక్రటరీపై కేసు పెట్టి జైల్లో పెడతామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిందని గుర్తుచేశారు. ఇదే విషయంలో కాంగ్రెస్ నాయకులు తలోమాట మాట్లాడుతూ పలుచన అవుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి సన్నిహితుడు, ఎంపీ మల్లు రవి యూనివర్సిటీని తరలిస్తామని చెప్తుంటే, పీసీసీ చీఫ్ మాత్రం అదేమీలేదంటున్నారని, అసలు కాంగ్రెస్ నాయకులు ఎవరేం మాట్లాడుతున్నారో వారికే అర్థంకావడంలేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తనకు దక్కనిది ఇంకెవరికీ దక్కవద్దనే దురుద్దేశంతో భూములను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. గతంలో తాను సందర్శించిన హెచ్‌సీయూలో ఇంతటి వివాదం జరుగుతుంటే రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడంలేదని

> *ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. అందుకే ఢిల్లీ పెద్దలు జోక్యం చేసుకుంటున్నారు. ఢిల్లీ పార్టీల చేతుల్లో పాలనా పగ్గాలుంటే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు క్యాబినెట్ విస్తరణ చేసుకొనే పరిస్థితి కూడా లేదు. కాంగ్రెస్, బీజేపీ.. రెండు పార్టీల జుట్టు ఢిల్లీ చేతిలో ఉన్నది. ఒకరు బ్యాగులు మోస్తే, ఇంకొకరు చెప్పులు మోస్తున్నారు. -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్*

ప్రశ్నించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే యూనివర్సిటీని సందర్శించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ వైఫల్యం.. మీనాక్షి జోక్యం

'ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. అందుకే ఢిల్లీ పెద్దలు జోక్యం చేసుకుంటున్నారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇక్కడకు వచ్చి ఏకంగా సచివాలయంలోనే మంత్రులతో సమీక్షించారు. విద్యార్థులతో చర్చించారు' అని కేటీఆర్ వివరించారు. 'ఢిల్లీ పార్టీల చేతుల్లో పాలనా పగ్గాలుంటే పరిస్థితులు ఇలాగే ఉంటాయని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు క్యాబినెట్ విస్తరణ చేసుకొనే పరిస్థితి కూడా లేదు. రెండు పార్టీల జుట్టు ఢిల్లీ చేతిలో ఉన్నది. ఒకరు బ్యాగులు మోస్తే, ఇంకొకరు చెప్పులు మోస్తున్నారు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలను పార్లమెంట్‌కు పంపిస్తే, రాష్ట్రానికి అదనంగా ఒక్క రూపాయి తెచ్చిందిలేదు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. డైవర్షన్ డ్రామాల్లో ఆరితేరిన రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కే విమానం, దిగే విమానం చందంగా పదే పదే ఢిల్లీకి వెళ్తూ పాలనను గాలికొదిలేశారని విమర్శించారు.

> *హెచ్‌సీయూలో ఇంత రగడ జరుగుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏమీ ఎరగనట్టు చోద్యం చూస్తున్నది. గతంలో తాను సందర్శించిన హెచ్‌సీయూలో ఇంతటి వివాదం జరుగుతుంటే రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడంలేదు? ఆయనకు చిత్తశుద్ధి ఉంటే యూనివర్సిటీని సందర్శించాలి -కేటీఆర్*

ఒక్కరోజే మోదీ హ్యాట్రిక్

ఎల్పీజీ ధరల పెంపు, పెట్రోల్‌పై సుంకాల పెంపు, స్టాక్ మార్కెట్‌లో రూ.16 లక్షల కోట్లు ఆవిరి.. ఇలా ప్రధాని మోదీ ఒక్కరోజే హ్యాట్రిక్ ఘనత సాధించారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ రేట్లు తగ్గుతుంటే, మన దేశంలో మాత్రం పెట్రోలియం ధరలు తగ్గించకపోవడంలోని ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదని మండిపడ్డారు. ఎక్సైజ్ సుంకం పెంపుతో రాష్ట్రానికి వచ్చే రాబడి ఏమీ ఉండదని, మొత్తం కేంద్రం ఖాతాల్లోకి పోతుందని వివరించారు. ఎల్పీజీ ధర పెంపుతో సామాన్యులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తంచేశారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసంబద్ధ నిర్ణయాలతో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్ల సొమ్ము రూ.16 లక్షల కోట్లు ఆవిరైంది. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు ఎదుర్కొంటూ సామాన్యుల సంపద కూడా ఆవిరి అవుతుంటే కేంద్రం మాట్లాడటంలేదు. ట్రంప్ సుంకాలు, నిర్ణయాల ప్రభావం రాష్ట్రంపై ముఖ్యంగా ఫార్మా, ఐటీ సెక్టార్లపై గణనీయంగా పడుతుంది. ఇంత జరిగినా ప్రధాని మోదీ, వాణిజ్య మంత్రి పల్లెత్తు మాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరం' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

బాధితులకు అండగా బీఆర్ఎస్

కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్న బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నదని కేటీఆర్ స్పష్టంచేశారు. 'లగచర్లలో తొమ్మిది నెలలుగా ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని ఆశ్రయించారు. మొన్న హెచ్‌సీయూ విద్యార్థులు మద్దతు కోసం మా వద్దకు వచ్చారు. అంతేగానీ, బీఆర్ఎస్ ఉద్దేశపూర్వకంగా ఎవరినీ రెచ్చగొట్టలేదు' అని స్పష్టంచేశారు. భవిష్యత్‌లోనూ ప్రజా సమస్యలపై బరాబార్ గిరిగిసి కొట్లాడుతామని తేల్చిచెప్పారు.

కాంగ్రెస్, బీజేపీ పొత్తుల సద్ది రేవంత్

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో పాలన సాగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. పొత్తుల సద్ది మాదిరిగా ఆయనకు రెండు పార్టీలు అండగా ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. ఆయనకు ఏ కష్టం వచ్చినా ఢిల్లీలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో బండి సంజయ్ అండగా ఉంటున్నారని విమర్శించారు. గతంలో అమృత్ స్కాంపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా కేంద్రం పట్టించుకోలేదని ఉదహరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేసి ఆరు నెలలైనా కేసులు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. రాష్ట్ర కాంగ్రెస్ కూడా కేంద్రంతో అంటకాగుతున్నదని, అందుకే ఎల్పీజీ ధరలు పెంచినా రాష్ట్రంలోని కాంగ్రెస్ పెద్దలు మాటమాత్రంగానైనా తప్పుబట్టడంలేదని దుయ్యబట్టారు. వీరి అనైతిక పొత్తును గమనించాలని ప్రజలను కోరారు. తెలంగాణకు శ్రీరామరక్ష ఇంటిపార్టీ అయిన బీఆర్ఎస్ అనే విషయం మరిచిపోవద్దని విజ్ఞప్తిచేశారు.

డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్‌ది స్పష్టమైన వైఖరి

'డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్ స్పష్టమైన వైఖరితో ఉన్నది. తమిళనాడు సీఎం స్టాలిన్ కంటే ముందునుంచే దక్షిణాదికి అన్యాయం జరుగుతున్నదనే విషయాన్ని చెప్తూ వస్తున్నాం' అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానం చెప్పారు. దీనిపై డీఎంకేతోపాటు కలిసివచ్చే పార్టీలతో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. సన్నబియ్యం పథకాన్ని తమ ఘనతగా కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ పథకానికి కేసీఆర్ ఏనాడో శ్రీకారం చుట్టారని, హాస్టళ్లలో సన్నబియ్యంతో ఆహారం అందించే కార్యక్రమాన్ని మొదలు పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వం రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సవాల్‌పై తోకముడిచిందని పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ మాఫీ కాలేదని, సీఎం స్వగ్రామంతోపాటు ఏ ఊర్లోనైనా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని విసిరిన సవాల్‌ను స్వీకరించకుండా అసెంబ్లీ సాక్షిగా పారిపోయిందని ఎద్దేవా చేశారు.

కేసులకు భయపడం

'ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టి అణచివేయాలని ప్రభుత్వం చూస్తున్నది. ఇది అయ్యే పనికాదు. నాపై ఎన్ని వందల కేసులు పెట్టారో తెలియదు. అయినా భయపడేది లేదు. పోరాటాన్ని ఆపేది లేదు' అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ఇటీవల సోషల్ మీడియా యాక్టివిస్టులను నియమించుకొని ప్రతిపక్షాలపై దాడికి ఉసిగొల్పిందని ఆరోపించారు. టూల్‌కిట్‌లా అందరూ ఒకే తరహాలో పదే పదే పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. వారికి జీతాలు ఎవరిస్తున్నారో అర్థంకావడంలేదని, రాష్ట్ర ఖజానా నుంచి మాత్రం చెల్లించవద్దని హెచ్చరించారు.

రేవంత్ ద్వేషం.. రైతులకు శాపం..

సీఎం రేవంత్ ద్వేషపూరిత వైఖరి రాష్ట్ర రైతులకు శాపంగా మారుతున్నదని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌పై ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్‌కు మరమ్మతు చేయించకపోవడంతో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. భూకంపంతోపాటు 28 లక్షల నీటి ప్రవాహానికి తట్టుకొని నిలబడ్డ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గతంలో తెలంగాణ సాగు ప్రాజెక్టులపై కేంద్రానికి పిటిషన్లు సమర్పించి అభ్యంతరం చెప్పిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదిత్యనాథ్‌దాస్‌ను రేవంత్‌రెడ్డి నీటి పారుదల సలహాదారుగా పెట్టుకోవడంలోని అంతర్యమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పారని పెట్టుకున్నారా? అని నిలదీశారు. సర్కారు వైఖరితో గోదావరి, కృష్ణా బేసిన్లలో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో నెగెటివ్ గ్రోత్ రేటు

రేవంత్ సర్కారు అస్తవ్యస్త నిర్ణయాలు, నెగెటివ్ విధానాలతో రాష్ట్రంలో నెగెటివ్ గ్రోత్ రేటు నమోదవుతున్నదని కేటీఆర్ విమర్శించారు. '16 నెలల కాలంలో వాహనాల కొనుగోలు తగ్గింది. రియల్‌ఎస్టేట్ పడిపోయింది. ఎయిర్‌పోర్ట్‌కు మెట్రోరైలు రద్దయింది. ఫార్మాసిటీ వెనక్కిపోయింది. హైడ్రా, మూసీ బ్యూటిఫికేషన్ పేరిట సాగించిన కూల్చివేతలతో రాష్ట్రం ఆగమైపోయింది' అని మండిపడ్డారు. 'సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సాయిరెడ్డి నుంచి మొదలుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దాకా అందరిపైనా నెగెటివ్ ధోరణే. లగచర్ల భూములివ్వబోమన్న గిరిజనులు, భూములు అమ్మవద్దన్న హెచ్‌సీయూ విద్యార్థుల దాకా అందరినీ బద్నాం చేసుడే. ఇంతకుమించి 16 నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిందేమీ లేదు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

కంచ భూముల పరిశీలనకు
సాధికార కమిటీ

- **సిద్ధాంత్‌దాస్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు ఏర్పాటు**
- **నేడు హైదరాబాద్ రానున్న కమిటీ సభ్యులు**
- **రెండురోజుల పాటు నగరంలో పర్యటన**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) కంచ గచ్చిబౌలి భూముల వివాదం మరో మలుపు తిరిగింది. అక్కడి వాస్తవ పరిస్థితిని తెలుసుకొనేందుకు సుప్రీంకోర్టు కేంద్ర సాధికార కమిటీని పంపాలని నిర్ణయించింది. వివాదాస్పదమైన ఆ 400 ఎకరాల భూమిలో చెట్లు మినహా జింకలు, నెమళ్లు లేనేలేవని, కృత్రిమ మేధతో సృష్టించిన వీడియో క్లిప్పింగ్‌లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించడం, ఈ నెల 3న హైకోర్టు రిజిస్ట్రార్ ఆ భూములను పరిశీలించి నివేదిక పంపిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. సిద్ధాంత్ దాస్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ బుధవారం హైదరాబాద్ రానున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆ కమిటీ 10, 11 తేదీల్లో రెండురోజుల పాటు ఉండి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకొని, సంబంధిత అధికారుల నుంచి సమాచారం కూడా తీసుకోనున్నట్టు తెలిసింది.

కమిటీ ఏం చేయనుంది?

సుప్రీంకోర్టు సాధికార కమిటీ ఈ నెల 10న కంచ గచ్చిబౌలిలోని హెచ్‌సీయు భూములలో క్షేత్రస్థాయి విచారణ జరిపి, అక్కడి చెట్లు, పర్యావరణం, జంతుజాలం వివరాలను నమోదు చేయనున్నట్టు సమాచారం. ఆ ప్రదేశాన్ని చదును చేయటానికి ముందే పర్యావరణ మదింపు జరిగిందా? చెట్లను తొలగించేందుకు అటవీశాఖ నుంచి అనుమతి తీసుకున్నారా? ఒక వేళ చెట్లను తొలగిస్తే అక్కడ ఉన్నటువంటి పక్షులు, జంతుజాలం విషయంలో తీసుకున్న ముందస్తు చర్యలేమిటి, నీటి వనరుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నా రు అనే విషయాలను పరిశీలించనుంది. రెండో రోజు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతోపాటు అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత శాఖ ఉన్నతాధికాలతో కమిటీ భేటీ అవుతుందని సమాచారం. అనంతరం యూనివర్సిటీ పాలకమండలి, విద్యార్థులు, పౌర సమాజం నుంచి కూడా వినతులు స్వీకరించే అవకాశముంది. ప్రజల నివాస ప్రాంతాల్లోకి జంతువులు ప్రధానంగా జింకలు వచ్చినట్టు వీడియోలు సోషల్ మీడియాలో తిరుగుతున్న నేపథ్యంలో... ఎంపవర్డ్ కమిటీ సమీప ప్రాంతాల ప్రజల నుంచి కూడా వివరాలు సేకరించే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది.

ఇదీ కమిటీ నేపథ్యం..

అటవీ, పర్యావరణ వివాదాలను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు 25 ఏండ్ల క్రితం సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇచ్చే నివేదికను అత్యున్నత ధర్మాసనం ప్రామాణికంగా తీసుకుంటుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు పోలవరం, కొల్లేరు లాంటి ప్రాంతాల్లో ఈ తరహా వివాదాలు ఏర్పడినప్పుడు ఎంపవర్డ్ కమిటీ నివేదికలను ప్రామాణికంగా తీసుకొని తీర్పులివ్వడం జరిగింది. మహారాష్ట్రలో మెట్రో కోసం చెట్లు నరికిన కేసులోనూ ఈ కమిటీ నివేదిక కీలకం అయ్యింది.

కాంగ్రెస్‌లో కంచ భూముల చిచ్చు!

- **అధిష్ఠానం దూతపై ముఖ్య నాయకుడు గుర్రు**
- **ఆదాయానికి గండి కొట్టిందని ఆగ్రహం**
- **మీనాక్షితో తాడోపేడో తేల్చుకొనేందుకు సిద్ధం**
- **ఆమెకు వ్యతిరేకంగా అనుకూల మీడియాలో కథనాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల వివాదం కాంగ్రెస్ పార్టీలో ఇంటిపోరుకు తెరలేపినట్టు తెలుస్తున్నది. అటు అధిష్ఠానం పంపిన దూతకు, రాష్ట్రంలోని ముఖ్యనేతకు మధ్య ఈ అంశం చిచ్చురేపినట్టు సమాచారం. హెచ్‌సీయూ భూముల నుంచి ఏదో ఆశించిన ఇద్దరు ప్రభుత్వ ముఖ్యుల ఎత్తుగడలకు ఇప్పటికే విద్యార్థులు, మీడియా, కోర్టులు తపోభంగం కలిగించాయి. దీనికితోడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తనకు అత్యంత విశ్వసనీయంగా ఉండే మీనాక్షి నటరాజన్‌ను రంగంలోకి దింపి మొత్తం వ్యవహారాన్ని తన చేతుల్లోకి తీసుకున్నారు. దీంతో మీనాక్షి నటరాజన్‌ను తన దారిలోకి తెచ్చుకొనేందుకు ముఖ్యనేత పావులు కదుపుతున్నట్టు జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో భాగంగానే ముఖ్యనేతకు అనుకూలంగా ఉన్న మీడియాలో మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా జోరుగా వార్తలు ప్రచురితమవుతున్నాయి.

ఇద్దరి మధ్య హెచ్‌సీయూ చిచ్చు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ నియామకం జరిగిన నాటి నుంచే ముఖ్యనేతకు ఆమెతో పొసగడం లేదని పార్టీలో చర్చ జరుగుతున్నది. ఇప్పుడు వీరిద్దరి వైరానికి హెచ్‌సీయూ వివాదం తోడైంది. ఇప్పుడు ఈ వివాదం ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ 'ఆదాయానికి' గండి కొట్టిందని ఒకరు.. పార్టీ పరువు గంగలో కలిపారంటూ మరొకరు ఇలా ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుతున్నట్టు పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. అధిష్ఠానం పేరు చెప్పి ఆమె.. స్థానిక పేరు చెప్పి ముఖ్యనేత ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. అధిష్ఠానం దూతగా మీనాక్షి మంత్రులు, అధికారులతో సమీక్షలు చేయడం, సమావేశాలు పెట్టడంపై ముఖ్యనేత తీవ్రంగా మండిపడుతున్నట్టు సమాచారం.

అధిష్ఠానం దూతపై ఆగ్రహం

కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములను అగ్గువకే అమ్మేసి వేల కోట్లు కొల్లగొట్టాలని ప్రభుత్వంలోని ఓ ఇద్దరు కీలక నేతలు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ కుట్రలో భాగంగానే భూమి విలువను తగ్గించి.. ఇక్కడే రూ.10వేల కోట్లు కొల్లగొట్టేందుకు భారీ స్కెచ్ వేసినట్టు సమాచారం. వీరు తమ పథకాన్ని అమలులో పెడుతుండగానే అటు విద్యార్థులు, ఆపై న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. దీంతో వారి ఆదాయానికి భారీ గండి పడింది. దీంతో ఇద్దరిలో ముఖ్యనేతకు ఫ్రస్ట్రేషన్ పీక్ చేరిందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ కోపంతోనే సదరు నేత సినిమా వారి మీద, సొంత పార్టీ నేతలపైన బూతు పురాణం ఎత్తుకున్నట్టు చెప్తున్నారు. దీనికితోడు మీనాక్షి నటరాజన్ వ్యవహారం తమ కాళ్లకు బంధం వేసినట్టు భావిస్తున్న ముఖ్యనేత ఆమెతో తాడోపేడో తేల్చుకొనేందుకు సిద్ధమైనట్టు గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా తమ పనితీరును ఆమె ప్రశ్నించడం, విమర్శలు చేయడం ముఖ్యనేతకు మింగుడుపడటం లేదని పేర్కొన్నాయి. ఆమె వ్యవహారం తనకు చెడ్డపేరు తెచ్చేదిగా ఉందని ముఖ్యనేత భావించడమే ఇందుకు కారణమని అంటున్నారు. దీంతో ఆమెకు చెక్ పెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది.

అనుకూల పత్రికల్లో వ్యతిరేక ప్రచారం!

మీనాక్షి నటరాజన్ తమ ఆదాయానికి గండి కొట్టిందని రగిలిపోతున్న ముఖ్యనేత ఆమెపై వ్యతిరేక ప్రచారానికి తెరలేపినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే తనకు అనుకూలంగా ఉన్న మీడియాలో మీనాక్షిపై వ్యతిరేక వార్తలు రాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పత్రికల్లో వరుసగా రెండు రోజులు మీనాక్షికి వ్యతిరేకంగా కథనాలు వెలువడటమే ఇందుకు నిదర్శనం. ఓ కథనం ఆమెను ఏకంగా సూపర్‌బాస్‌గా పేర్కొనగా, మరో కథనం రాష్ట్రంపై ఢిల్లీ అధిష్ఠానం పెత్తనం తెలుగు ఆత్మగౌరవానికి అవమానంగా వర్ణించడం గమనార్హం.



నోటీసులు ఇచ్చాకే దర్యాప్తు చేయండి

- **క్రిశాంక్‌పై కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌పై నమోదు చేసిన కేసుల్లో బీఎన్ఎస్ఎస్ 35 కింద నోటీసు ఇచ్చాక కేసు దర్యాప్తు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత సమయంలో జింకలు భయపడి పారిపోయినట్టుగా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు పెట్టారంటూ క్రిశాంక్‌పై పోలీసులకు మూడు ఫిర్యాదులు అందాయి. మొయినాబాద్‌లోని చిలుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, టీపీసీసీ సోషల్ మీడియా విభాగం చైర్మన్ మన్నె సతీశ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా గచ్చిబౌలి పోలీసులు క్రిశాంక్‌పై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే అంశంపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధమని, ఆ కేసులను కొట్టివేయాలంటూ క్రిశాంక్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం జస్టిస్ తుకారాంజీ విచారణ చేపట్టారు. పిటిషనర్‌ను దర్యాప్తు చేసే ముందు బీఎన్ఎస్ఎస్ 35 సెక్షన్ కింద నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పోలీసుల విచారణకు సహకరించాలని క్రిశాంక్‌ను ఆదేశించారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన

- **అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను ముట్టడించి నిరసన ప్రదర్శన**
- **క్యాంపస్‌లోని పోలీసులను వెనక్కి పంపాలని డిమాండ్**
- **విద్యార్థులు వస్తున్నారని తెలిసి వెళ్లిపోయిన రిజిస్ట్రార్**

హైదరాబాద్ సిటీబ్యూరో ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై కాంగ్రెస్ సర్కారు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ అనుసరిస్తున్న తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో మంగళవారం క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను ముట్టడించారు. 400 ఎకరాల పరిసరాల్లోనే పోలీసుల బందోబస్తు కొనసాగిస్తున్నామని చెప్పి, క్యాంపస్ అంతటా ఎందుకు మోహరించారని నిలదీశారు. హెచ్‌సీయూపై ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటి అన్నట్టుగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరిస్తున్నామన్న భట్టివిక్రమార్క ప్రకటన ఉత్తమాటే అయిందని ధ్వజమెత్తారు. విద్యార్థులు వస్తున్నారని తెలిసి రిజిస్ట్రార్ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లిపోయారని విద్యార్థులు తెలిపారు. రిజిస్ట్రార్ విద్యార్థుల తరఫున కాకుండా ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. వీసీతో భేటీకి ఎగ్జామినేషన్ కంట్రోలర్ కూడా అనుమతించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. క్యాంపస్ నుంచి పోలీసులను ఉపసంహరించేలా ప్రభుత్వానికి లేఖ రాయాలని రిజిస్ట్రార్‌ను డిమాండ్ చేశారు.

అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ముందు నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు